సాక్షి
మహబూబ్‌నగర్
సోమవారం, 25, ఆగస్టు, 2025



'అమృత్‌భారత్' స్టేషన్లు

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నాలుగు స్టేషన్‌లకు అమృత్ భారత్ పథకం కింద నిధులు కేటాయించగా పనులు పురోగతిలో ఉన్నాయి.

-8లో ▸



విద్యుదుత్పత్తికి ఆటంకం

జూరాలకు ఎగువ నుంచి భారీ వరద నీరు వస్తుండటంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ఆటంకం కలుగుతోంది.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
34.5/21.3

వాతావరణం

ఉదయం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం ప్రశాంతంగా ఉంటుంది. జల్లులు పడే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలి: పీయూ వీసీ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వీసీ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ మేరకు బాలికల హాస్టల్‌లో నిర్మిస్తున్న అదనపు డైనింగ్ హాల్, రీసెర్చ్ ఫెసిలిటీ భవనం, నూతన ఇంజనీరింగ్, లా కళాశాలల భవనాలను ఆయన పరిశీలించారు. భవనాలను సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయాలని, పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. ఆయన వెంట పలువురు పీయూ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 19 నెలలు గడుస్తున్నప్పటికీ.. మద్యంపై ఉన్న ధ్యాస ప్రభుత్వానికి విద్యారంగంపై లేదని విమర్శించారు. మద్యం శాఖకు మంత్రి ఉన్నాడు కానీ, ఒక్క విద్యాశాఖకు మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో 90 శాతం గురుకులాలు అద్దెభవనాల్లో నడుస్తున్నాయని, పీయూకు రూ.500 కోట్ల నిధులను విడుదల చేయాలని, లా, ఇంజనీరింగ్ కళాశాలలకు అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. గతంలో నేదురుమల్లి జనార్దన్ ప్రభుత్వాన్ని విద్యార్థులే కూల్చారని, ప్రభుత్వం విద్యార్థులను విస్మరిస్తే భవిష్యత్‌లో అదే జరుగుతుందని హెచ్చరించారు. నాయకులు కురుమూర్తి, లక్ష్మణ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రశాంత్, భరత్, మోహన్, భరత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు, సంయుక్త కార్యదర్శి జీఎస్ రెడ్డి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌ను కోరారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను ఆదివారం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒబేదుల్లా కొత్వాల్‌ను తమ ఫోరానికి గౌరవాధ్యక్షుడిగా ఉండాలని కోరగా అందుకు అంగీకరించినట్లు తెలిపారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు జగపతిరావు, నాగభూషణం, విశ్రాంత ఉద్యోగ నాయకులు పాల్గొన్నారు.

చేప చేప.. ఎక్కడున్నావ్?



ఆలస్యమవుతున్న ఉచిత చేప పిల్లల పంపిణీ

- నిర్లక్ష్యపు ముసురులో మత్స్యశాఖ
- చెరువుల్లో నీరు వచ్చినా ఇంకా ప్రారంభం కాని చేప విత్తనాల పంపిణీ
- ఇటీవల టెండర్లు పిలిచినా.. ప్రక్రియ మరింత ఆలస్యం
- చేప పిల్లల కోసం ఎదురుచూస్తున్న మత్స్యకారులు
- నగదు బదిలీ చేస్తే తామే కొనుగోలు చేస్తామంటున్న వైనం



ఇది భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామ పరిధిలోని ఏలిక చెరువు. దీనితో పాటు సుడి చెరువు, మరో రెండు కుంటలు ఈ గ్రామ పరిధిలో ఉన్నాయి. గత నెలలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు నిండాయి. అలుగులు సైతం పారుతున్నాయి. ఈ చెరువులు, కుంటలపై ఆధారపడి కొత్త మొల్గర మత్స్యపారిశ్రామిక సహకార సంఘంలోని 55 మంది సభ్యుల మత్స్యకార కుటుంబాలు చేపల వృత్తిని కొనసాగిస్తున్నారు. జూన్, జూలై నెలల్లోనే వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు వచ్చినా ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చే ఉచిత చేపపిల్లలు పంపిణీ చేయలేదు. మరింత ఆలస్యమైతే నష్టపోతామని భావించి ఏపీలోని కైకలూరు నుంచి 1.5 లక్షల చేప విత్తనాలు కొనుగోలు గతేడాది అక్టోబర్‌లో వాటిలో వదిలారు. ఆలస్యం కావడంతో చేపలు అర కేజీ కూడా పెరగలేదని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ముందస్తుగానే వర్షాలు కురిసి చెరువుల్లోకి నీరు చేరినా మత్స్యశాఖ నిర్లక్ష్యపు ముసురు ఇంకా వదలడంలేదు. ప్రభుత్వం మత్స్యకారులకు అందజేస్తున్న వందశాతం సబ్సిడీ చేప పిల్లల పంపిణీ ప్రక్రియను ఇంకా మొదలు పెట్టనేలేదంటే ఆ శాఖ పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది. ప్రతి ఏడాది జూన్, జూలై మాసాల్లో చెరువుల్లో నీరు చేరగానే చేపపిల్లల పంపిణీ జరగాలి. ముందస్తు ప్రణాళికతో మత్స్యశాఖ అంచనాలు సిద్ధం చేసి చెరువుల వారీగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల పరిధిలోని చెరువులు, కుంటల్లో చేపపిల్లల పంపిణీ చర్యలు చేపట్టాలి. కాగా.. ఈ ఏడాది మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ప్రభుత్వం ద్వారా ఉచిత చేపపిల్లల పంపిణీ కోసం ఇంకా ప్రణాళికలే రూపొందించలేదు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ, హేచరీల క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి.. చేపపిల్లలు వదిలేందుకు సిద్ధంగా ఉండాలి కానీ ఇంకా కార్యాచరణ ప్రారంభించలేదు. గ్రామాల్లోని మత్స్య సహకార సంఘాలు ఒత్తిడి మేరకు ప్రభుత్వం తాజాగా టెండర్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. వచ్చే నెల 1వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేస్తామని, తదనంతరం చేప పిల్లల పంపిణీ చేపట్టనున్నట్లు మత్స్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

❒ జిల్లాలో 1091 చెరువులు, కుంటలు ఉండగా.. అలుగు పారిన వాటితో పాటు 80శాతానికి పైగా నిండినవి చిన్న నీటి పారుదల శాఖ నివేదికల ప్రకారం 918 ఉన్నాయి. వీటిలో అక్కడక్కడా ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన చేప విత్తనాలు వదలగా మిగతా వాటిలో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే వాటికోసం ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో 1,091 చెరువులు, కుంటలు	మత్స్య సొసైటీలు	మహిళా సొసైటీలు	సభ్యులు
	235	20	12,652 మంది

నగదు బదిలీ కోసం డిమాండ్

ప్రతి సంవత్సరం మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల పరిధిలోని చెరువులు, కుంటలకు ఇస్తున్న ఉచిత చేపపిల్లలు నాణ్యత లేక తీవ్రంగా నష్టపోతున్నామని, నగదు బదిలీ చేస్తే తామే కొనుగోలు చేస్తామనే మత్స్యసహకార సంఘాలు డిమాండ్ చేస్తున్నా.. ప్రభుత్వం అదేమీ పట్టించుకోకుండా పాతపద్ధతిలోనే టెండర్లు ఆహ్వానించింది. మళ్లీ కాంట్రాక్టర్లకు అప్పగిస్తే చేపపిల్లల నాణ్యత సరిగా ఉండదని మత్స్యకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగదు బదిలీ నేరుగా సంఘాల ఖాతాలకు జమ చేయడం ద్వారా నిధులు పక్కదారి పట్టే అవకాశం లేదని.. తామే కొనుగోలు చేసి చెరువుల్లో వదులుకుంటామని చెబుతు న్నారు. కాగా ఉచిత చేప విత్తనాల పంపిణీ ప్రక్రియలో జరుగుతున్న ఆలస్యంపై జిల్లా మత్స్యశాఖ అధికారిని సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

సరైన సమయంలో ఇవ్వాలి..



మా చెరువులు నిండి 20 రోజులు కావస్తున్నా.. ఉచిత చేప విత్తనాలు ఇవ్వలేదు. ఆలస్యంగా ఇస్తే లాభం లేదు. గతేడాది ప్రభుత్వం ఇచ్చే చేప విత్తనాలను నమ్ముకొని తీవ్రంగా నష్టపోయాం. నాణ్యత లేకపోవడంతో చేపల సైజు పెరగలేదు. సరైన సమయంలో చేప విత్తనాలు నాణ్యతతో ఇస్తే మత్స్యకారులకు మేలు జరుగుతుంది. లేదంటే ప్రభుత్వం నుంచి మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలకు నగదు బదిలీ అయినా చేస్తే సంఘాల ద్వారా కొనుగోలు చేస్తాం.

– చింతకాయల లక్ష్మయ్య,
కొత్త మొల్గర మత్స్యపారిశ్రామిక సంఘకార సంఘం అధ్యక్షుడు

ఇప్పటికే వదిలి ఉంటే బాగుండేది..



మా గ్రామానికి సమీపంలో ఉన్న హేమసముద్రం చెరువులోకి ఇటీవల కురిసిన వర్షాలకు నీళ్లు వచ్చాయి. ప్రభుత్వం ఉచిత చేప విత్తనాలు ఎప్పుడిస్తారనేది ఇంకా చెప్పడం లేదు. ఇప్పటికే చేప విత్తనాలు చెరువులో వదలి ఉంటే బాగుండేది. గతేడాది ఆలస్యంగా చేపవిత్తనాలు ఇవ్వడంతో చేపలు సైజు రాలేదు. నాణ్యత లేక ఆశించిన దిగుబడి రాలేదు. టెండర్లే ఇప్పుడు పిలిచారంటే.. చేప విత్తనాల పంపిణీ మరింత ఆలస్యమవుతుంది.

– వల్లూరి అంజిలయ్య, ఇబ్రహీంబాద్, హన్వాడ మండలం

ఇంకా పునరుద్ధరించలే!

శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో సిద్ధం కాని నాలుగో యూనిట్

- 2020 ఆగస్టు 20 నాటి దుర్ఘటనలో 9 మంది ఉద్యోగుల మృతి
- ఏళ్ల తరబడిగా సాగుతున్న మరమ్మతు ప్రక్రియ
- మరో నెల రోజుల్లో సిద్ధం చేస్తామంటున్న సీఈ
- ప్రస్తుతానికి ఐదు యూనిట్లతోనే విద్యుదుత్పత్తి

సాక్షి, నాగర్‌కర్నూల్: శ్రీశైలం ఎడమగట్టు భూగర్భజల విద్యుత్ కేంద్రంలో జరిగిన ఘోర ప్రమాద ఆనవాళ్లు నేటికీ చెదిరిపోవడం లేదు. 2020 ఆగస్టు 20న రాత్రి నాలుగో యూనిట్‌లో చోటుచేసుకున్న షార్ట్‌సర్క్యూట్ కారణంగా.. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వెలుగులు ప్రసరింపజేసే భూగర్భ కేంద్రంలో చీకట్లు కమ్ముకున్నాయి. ప్రమాదం కారణంగా చెలరేగిన మంటలు, పొగలతో ఉక్కిరిబిక్కిరికి గురై డ్యూటీలో ఉన్న తొమ్మిది మంది ఉద్యోగులు మరణించారు. తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ అందిస్తున్న శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలోని నాలుగో యూనిట్ ప్యానెల్ బోర్డులో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగడం, చుట్టూ మంటలు, పొగలో చిక్కుకుని ఏడుగురు జెన్‌కో ఉద్యోగులు, ఇద్దరు అమరాన్ బ్యాటరీ కంపెనీకి చెందిన ఉద్యోగులతో సహా మొత్తం తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా.. ప్రమాదం సంభవించిన నాలుగో యూనిట్‌ను నేటికీ పునరుద్ధరించకపోవడం కొసమెరుపు.

ఇదే తొలి ప్రమాదం..

శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 2001 ఫిబ్రవరిలో ఒక యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. ఈ కేంద్రంలో మొత్తం 6 యూనిట్లకు గానూ ఒక్కో యూనిట్ 150 మెగావాట్ల చొప్పున మొత్తం 900 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉంది. 2020 వరకూ ఈ కేంద్రంలో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి కొనసాగింది. 24 గంటల వ్యవధిలో 6 యూనిట్ల ద్వారా 21 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసేవారు. అయితే ఐదేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో నాలుగో యూనిట్ పూర్తిగా ధ్వంసం కాగా.. ఇప్పటి వరకు ఈ యూనిట్ పునరుద్ధరణ పూర్తికాలేదు. అయితే భూగర్భ కేంద్రం చరిత్రలోనే ఇదే తొలి ప్రమాదం కావడం గమనార్హం.



నాలుగో యూనిట్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న అధికారులు (ఫైల్)

ఐదేళ్లుగా సా..గదీత

ప్రమాదం జరిగినప్పటి నుంచి నాలుగో యూనిట్ పునరుద్ధరణ పనులను చేపట్టినా ఇప్పటి వరకు అధికారులు అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. పూర్తిగా ధ్వంసమైన నాలుగో యూనిట్‌ను పునరుద్ధరణ పనులు రెండేళ్ల కిందట పూర్తిచేసినా, సాంకేతిక సమస్యలతో విద్యుదుత్పత్తి చేపట్టడం లేదు. గతేడాది డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ కేంద్రాన్ని సందర్శించి నాలుగో యూనిట్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్రం పూర్తి విద్యుదుత్పత్తి సామర్థ్యం 900 మెగావాట్లు కాగా.. ప్రస్తుతం ఐదు యూనిట్ల ద్వారా 750 మెగావాట్ల సామర్థ్యంతోనే విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. నాలుగో యూనిట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తేనే గరిష్ట స్థాయిలో విద్యుదుత్పత్తి చేసే అవకాశం ఉంది.

❒ ఈ విషయమై శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రం సీఈ సత్యనారాయణను సంప్రదించగా నాలుగో యూనిట్ పునరుద్ధరణ పనులు 24 గంటల పాటు కొనసాగుతున్నాయని, మరో నెల రోజుల్లో విద్యుదుత్పత్తి చేపట్టేలా కృషిచేస్తామన్నారు.

భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రోడ్లకు అడ్డుగా మండపాలు ఏర్పాటు చేయొద్దు
- ఎస్పీ డి.జానకి



మహబూబ్‌నగర్ క్రైం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ డి.జానకి ఆదేశించారు. ఆదివారం జిల్లా పోలీస్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివాదాస్పద ప్రదేశాలలో, రోడ్డుకు అడ్డంగా మండపాలు ఏర్పాటు చేసి వాహనదారులకు ఇబ్బందులు సృష్టించరాదన్నారు. అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు, ఇతర అత్యవసర వాహనాల రవాణాకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. శబ్ద కాలుష్యం, విద్యుత్ కనెక్షన్లు, భద్రత ఏర్పాట్లపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోలీస్ అధికారులు వినాయక మండపాల దగ్గర గస్తీ, సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు.

ర్యాగింగ్ చేయడం నేరం..

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేయడం చాలా నేరమని.. అలా చేస్తే కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాగింగ్ చేసే వాళ్లు వెంటనే కళాశాల నుంచి బహిష్కరణకు గురవుతారని, క్రిమినల్ కేసుల వల్ల విద్య, ఉద్యోగాలతో పాటు భవిష్యత్‌లో ఉత్తమ అవకాశాలు లేకుండా పోతాయని తెలిపారు.

⇨ సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కొత్త పద్ధతులను ఉపయోగిస్తున్నారని డాట్ వెరిఫికేషన్ వంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డి.జానకి సూచించారు. బ్యాంకు ఎగ్జిక్యూటివ్‌గా నటిస్తూ ప్రీమియం సర్వీస్‌లు కలిగిన క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తామని నమ్మించి మోసం చేస్తారని గ్రహించాలన్నారు. డాట్ సిమ్ వెరిఫికేషన్ పేరుతో నకిలీ బ్యాంకు స్టిక్కర్లు ఉన్న కాన్ఫిగర్ చేసిన మొబైల్స్‌ను కొరియర్ చేస్తూ మోసం చేస్తున్నారని తెలిపారు. ముందే మెసేజ్ ఫార్వాడింగ్ యాప్ మోసగాళ్ల ఖాతాలకు లింక్ చేసి ఉంటుందని, బాధితుడు అలాంటి ఫోన్‌లో సిమ్ వేసిన వెంటనే ఆ యాప్ వెంటనే యాక్టివేట్ అవుతుందని నకిలీ డాట్ సెక్యూర్ ఐకాన్ యాడ్ చేసి ఒరిజినల్‌గా చూపిస్తారని తెలిపారు. ఇలాంటి వాటి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు చేయూతనిస్తే అద్భుతాలు సృష్టిస్తారు



తాను నేర్చుకున్న అంశాలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వివరిస్తున్న విద్యార్థి

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూత ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 28 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి పైలెట్ ప్రాజెక్టుగా శతశాతం వినూత్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న విద్యార్థుల ప్రేరణ శిక్షణ తరగతులను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. మొదటి రోజు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎమ్మెల్యే ఎదుట విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు అని అన్నారు. రెండురోజుల పాటు సిలబస్ బోధించడమే కాకుండా పెద్దలను గౌరవించడం, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడంతో పాటు పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించడమే శత శాతం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని 28 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి వలంటీర్లను నియమించామన్నారు. వలంటీర్లు విద్యార్థులను మానసికంగా, ధృడంగా ఎదిగేందుకు కృషి చేస్తారని అన్నారు. పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిశీలించి వెనుకబడిన సబ్జెక్టుల్లో నుంచి ఫలితాలు సాధించే విధంగా విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇస్తారని అన్నారు. శతశాతం కార్యక్రమంతో రాబోయే నాలుగైదేళ్లలో అద్భుతమైన ఫలితాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ సభ్యులు రవీందర్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, అనిల్, రాజ మల్లేష్ పాల్గొన్నారు.

ప్రజల దీవెనలతో ప్రజాపాలన

- 'పనుల జాతర'లో రూ.20,200 కోట్లు ఖర్చు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



జంగంరెడ్డిపల్లిలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

అమ్రాబాద్/వెల్దండ: ప్రజా పాలనలో ప్రజల ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజల దీవెనలతో అన్ని వర్గాల ప్రజలు, అన్నిరంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జంగంరెడ్డిపల్లిలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. గ్రామాలు బాగుండాలని ప్రభుత్వం పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మొత్తం 1,500 పనులకు గాను రూ.20,200 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టవచ్చన్నారు. ముఖ్యంగా మహిళా సంఘాల అభివృద్ధి కోసం ఇప్పటికే ప్రభుత్వం క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసి మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించే దిశగా ప్రోత్సహిస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం మహిళలకు పావలా వడ్డీ రుణాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, కానీ, తమ ప్రజల ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తుందని పేర్కొన్నారు. గతంలో 60 ఏళ్లు దాటిన మహిళలను తొలగించారని, ఇప్పుడు వారిని కూడా చేర్చుకోవాలని తాము చెబుతున్నామన్నారు. చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని మంత్రి సీతక్క అన్నారు. మహిళలు స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, తమ పిల్లలను ఉన్నత చదువులను చదివించాలని సూచించారు. ఆయా కార్యక్రమంల్లో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, అదనపు కలెక్టర్ దేవసహాయం, డీఆర్‌డీఓ ఓబులేష్, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

కోయిల్‌సాగర్ నీటిమట్టం 32.4 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం ఆదివారం సాయంత్రం వరకు 32.4 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 32.6 అడుగులుగా ఉంది. రెండు రోజుల క్రితం ప్రాజెక్టు గేట్లను పూర్తిగా మూసివేశారు. వానాకాలం పంటలకు ఆదివారం ఉదయం నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదలను కొన సాగిస్తున్నారు. అలాగే గొలుసుకట్టు చెరువులు నింపడానికి కూడా కాల్వల ద్వారా నీటిని విడుదల చేశారు.

మహబూబ్‌నగర్ వద్దు.. వికారాబాద్‌లో కలపండి

- గండేడ్, మహమ్మదాబాద్ మండల జేఏసీ తీర్మానం
- త్వరలో సీఎంను కలిసి సమస్య వివరిస్తామన్న నాయకులు

- వివరాలు 8లో ▸

రైతు ఆపదలో ఉంటే ప్రభుత్వాల నిర్లిప్తత



ఏఐయూకేఎస్ రాష్ట్ర మహాసభల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: దేశానికి అన్నం పెట్టే రైతు ఆపదలో ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లిప్తత చూపుతున్నాయని ఏఐయూకేఎస్ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర మహాసభల ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి అందలం ఎక్కి ఆగం చేస్తున్నారని విమర్శించారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫారసులను అమలు చేసి వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించే చట్టా న్ని, పంటలకు సాగునీటి వసతి కల్పించే వసతులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈనెల 25, 26 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ, ఏఐయూకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాము, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, నర్సింహ, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రఫి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- ఆరు నెలల క్రితం ఆత్మహత్యాయత్నం
- పోక్సో కేసులో వేధింపులతోనే అంటున్న బంధువులు



అచ్చంపేట రూరల్: ఓ కేసులో నిందితుడిగా ఉండి జైలుకు వెళ్లి వచ్చిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని సిద్ధాపూర్‌కు చెందిన పాల్వాయి హరీష్ (22)పై 8 నెలల క్రితం పోక్సో కేసు నమోదైంది. రిమాండ్‌కు తరలించగా బెయిల్‌పై బయటకు వచ్చాడు. హరీష్‌ను యువతి బంధువులు బెదిరింపులకు పాల్పడుతున్నారని మనస్థాపానికి గురైన హరీష్ మార్చి నెలలో వీడియో తీసుకుంటూ తన చావుకు కారకుల పేర్లు చెబుతూ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆరు నెలల పాటు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. హరీష్ మృతికి కారకులైన వారిపై కేసు నమోదు చేయాలని కుటుంబ సభ్యులు సిద్ధాపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. కేసు నమోదు చేయడంతో ఆందోళన విరమించారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



రాము (ఫైల్)

చిన్నచింతకుంట: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ కథనం ప్రకారం.. చిన్నచింతకుంటకు చెందిన సంఘమోని రాము(41) ఆదివారం గ్రామ సమీపంలోని ఊకచెట్టు వాగులో నిర్మించిన చెక్‌డ్యాంలో చేపల వేటకు వెళ్లి వల వేశాడు. అయితే వలను తీసే సమయంలో ప్రమాదవశాత్తు వల చుట్టుకొని చెక్‌డ్యాంలో మునిగి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై రాము భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాముకు భార్యతోపాటు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

చోరీ కేసులో రిమాండ్

- 7 తులాల బంగారం, 70 తులాల వెండి స్వాధీనం



బిజినేపల్లి: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన బత్తుల మల్లయ్య నుంచి దొంగతనం కేసులో 7 తులాల బంగారం, 70 తులాల వెండి, మొబైల్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అశోక్ రెడ్డి ఆదివారం విలేకర్లకు తెలిపారు. ఏడాది కాలంగా దొంగతనాల కు అలవాటు పడిన మల్లయ్య 5 ఇళ్లలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణలో బత్తుల మల్లయ్యపై అనుమానంతో విచారించగ చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడన్నా రు. ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

‘అమృత్‌భారత్’ స్టేషన్లు



రూపురేఖలు మారనున్న మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్

- వన్‌స్టేషన్.. వన్‌ప్రొడక్టు కింద రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ
- ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, గద్వాల, జోగుళాంబ స్టేషన్లలో పురోగతి పనులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో రైల్వేస్టేషన్ల రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికుల సౌకర్యాలకు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ పెద్దపీట వేస్తోంది. అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద రైల్వేస్టేషన్లలో పునరాభివృద్ధి (ఆధునీకరణ) పనులు చేపడుతన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాలుగు స్టేషన్‌లకు అమృత్ భారత్‌స్టేషన్ పథకం కింద నిధులు కేటాయించగా పనులు పురోగతిలో ఉన్నాయి.

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద స్టేషన్లను అన్నివిధాలుగా ఆధునీకరించనున్నారు. ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని వసతులు కల్పించనున్నారు. ముఖ్యంగా స్టేషన్ ముఖద్వారాలు, ప్రణాళికబద్ధమైన పార్కింగ్, పాదాచారుల మార్గాలు, మెరుగైన లైటింగ్ సౌకర్యాల

చేపట్టే పనులు, సౌకర్యాలు

తోపాటు అహ్లాదకరమైన అనుభూతి కలిగేందుకు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా స్టేషన్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. స్టేషన్ ఆవరణలో పార్కులను కూడా అభివృద్ధి చేయనున్నారు. అదేవిధంగా ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి పథకం కోసం స్టాల్స్ కేటాయించడం, అత్యున్నత ప్లాట్‌ఫారాలు, తగిన ప్లాట్‌ఫారం స్లాటర్‌ల నిర్మాణం, అధిక నాణ్యతగల పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, ఎల్‌ఈడీ ఆధారిత స్టేషన్ నేమ్ బోర్డులు, వెయిటింగ్ హాల్స్ మెరుగుదల తదితర ప్రయాణికుల సదుపాయాలు, సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు.

నాలుగు స్టేషన్‌లకు ఏబీఎస్ఎస్ నిధులు

రైల్వే ప్రయాణికులకు ప్రపంచస్థాయి సౌకర్యాలను అందించడానికి భారీస్థాయిలో రైల్వేస్టేషన్లను అప్‌గ్రేడ్ చేయడానికి భారతీయ రైల్వేలో గొప్ప మార్పులు తీసుకొస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని నాలుగు రైల్వేస్టేషన్లకు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఆధునీకరణ పనులు చేపడుతున్నారు. మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు రూ.39.82 కోట్లు, జడ్చర్ల స్టేషన్‌కు రూ.35.54 కోట్లు, గద్వాల స్టేషన్‌కు రూ.34.29 కోట్లు, బాలబ్రహ్మేశ్వర జోగుళాంబ స్టేషన్‌కు రూ.6.07 కోట్లతో ఏబీఎస్ఎస్ పనులు జరుగుతున్నాయి. రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు అనుభూతి కలిగేలా మినీ ఎయిర్‌పోర్టులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయి.



గద్వాల రైల్వేస్టేషన్

స్టేషన్ల రూపురేఖలు మారుతాయి



అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వేస్టేషన్‌లను అభివృద్ధి చేస్తుండడం చాలా సంతోషంగా ఉంది. ఈ పథకంతో రైల్వే స్టేషన్ల రూపురేఖలు మారిపోతాయి. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటవుతాయి. ముఖ్యంగా దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లకు ఎన్నో సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. రైల్వే స్టేషన్లలో ఏబీఎస్ఎస్ పనులు చేపడుతున్నందుకు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖకు ధన్యవాదాలు.

– గోపాల్‌నారాయణ, డీఆర్‌యూ సీసీ మెంబర్

జూరాలకు నిలకడగా వరద



జూరాల నుంచి 37 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు/ రాజోళి/ ఆత్మకూర్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8 గంటల వరకు 3.72 లక్షల క్యూసెక్కులు రావడంతో ప్రాజెక్టు 37 క్రస్టు గేట్లను ఎత్తి 3,53,573 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అలాగే ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కుడి కాల్వకు 490, సమాంతర కాల్వకు 600 క్యూసెక్కులు వదలగా మరో 41 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.585 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇదిలా ఉండగా.. ఆల్మట్టి ప్రాజెక్టుకు 2,75,568 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. దిగువకు 2 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. దీంతో నారాయణపూర్ ప్రాజెక్టుకు 2.10 లక్షల క్యూసెక్కులు వస్తుండగా 30 గేట్లను ఎత్తి 1,70,340 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

సుంకేసులలో 9 గేట్లు ఎత్తివేత

సుంకేసులలో 9 గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఆదివారం ఎగువ నుంచి 42 వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రాగా.. 38,493 క్యూసెక్కులు దిగువకు విడుదల చేసి కేసీ కెనాల్‌కు 2,626 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుదుత్పత్తికి ఆటంకం

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీస్థాయిలో వరద నీరు వస్తుండటంతో దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ఆటంకం కలుగుతోంది. అత్యధికంగా వరద నీరు వస్తుండడంతో ఉత్పత్తి సాధ్యమవదని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. కాగా ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 533.580 మి.యూ., చేపట్టామని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా యోగా క్రీడాకారుల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా సీనియర్ యోగా క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లకు పైబడి క్రీడాకారుల ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ రానున్న రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. 18–21 ఏళ్ల విభాగానికి ఎం.నందిని, జెట్టి.కావేరి, బి.అంకిత, పూజ, శైలజ, 21–25 విభాగానికి బి.స్వప్న, ఎస్.శ్వేత, సాగర్, మధు, ఆకాశ్, 25–30 విభాగానికి ఎం.బాలమణి, 35–45 విభాగానికి కె.వెంకటేశ్‌లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, ఆర్.బాల్‌రాజు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, పీడీ రజిని, సీనియర్ క్రీడాకారులు మణికంఠ, సాగర్, బాలమణి పాల్గొన్నారు.

జెన్‌కోలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



మాట్లాడుతున్న జెన్‌కో హెచ్‌ఆర్, ఐఆర్ డైరెక్టర్ కుమార్ రాజు

ఆత్మకూర్: ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో ఆదివారం తెంగాణ జెన్‌కో రాష్ట్రస్థాయి క్యారమ్స్, చెస్ పోటీలను హెచ్‌ఆర్, ఐఆర్ డైరెక్టర్ ఎస్వీ కుమార్ రాజు ప్రారంభించారు. ఆదివారం ఎగువ జూరాలను సందర్శించిన ఆయన విద్యుదుత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వరద నీరు భారీగా వస్తుండడంతో ఉత్పత్తి చేపట్టలేకపోతున్నామని స్థానిక అధికారులు వివరించారు. ఇక్కడ జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో కొత్తగూడెం థర్మల్ కేంద్రం, శ్రీశైలం, జూరాల, భద్రాద్రి, విద్యుత్ సౌధ, యాదాద్రి, పులిచింతల ప్రాజెక్టులకు చెందిన 60 మంది ఉద్యోగులు పాల్గొంటున్నారన్నారు. పోటీలు మరో మూడు రోజులపాటు కొనసాగుతాయని, అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఈలు శ్రీధర్, సురేష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన నాగలక్ష్మి ఈ నెల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. దీంతో ఆదివారం బాధిత కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఉమ్మడి జిల్లాలో ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మక్తల్ మండలం సంగంబండ సమీపంలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్న యువతిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. అటుగా వెళ్తున్న రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి గమనించి.. రోడ్డుపై పడి ఉన్న మృతదేహాన్ని మక్తల్ మార్చురీకి తరలించి మానవత్వం చాటుకున్నారు. కల్వకుర్తి పట్టణంలో లారీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా.. గట్టు మండలం మిట్టదొడ్డి స్టేజీ సమీపంలో లారీ బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం చెందాడు.

– మక్తల్/కల్వకుర్తి టౌన్/గట్టు/వెల్దండ

■ మక్తల్ మండలం దాసర్‌పల్లికి చెందిన కృష్ణవేణి అలియాస్ కిష్టమ్మ (30) కొన్ని రోజులుగా భిక్షాటన చేస్తూ మక్తల్ మండలం సంగంబండ సమీపంలోని ఆశ్రమంలో ఉండేది. ఆదివారం ఆశ్రమం నుంచి సంగంబండ గ్రామం వైపు ఆమె నడుచుకుంటూ వస్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ఆమెకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న మంత్రి వాకిటి శ్రీహరి అక్కడికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అక్కడి నుంచి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సమాచారం అందుకున్న సీఐ రాంలాల్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.



మిట్టదొడ్డి సమీపంలో బోల్తాపడిన లారీ

■ మహారాష్ట్ర నుంచి ఉలిగడ్డల లోడ్‌తో వెళ్తున్న లారీ గట్టు మండలం మిట్టదొడ్డి స్టేజీ సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ సంతోష్ (38) మృతిచెందాడు. మరో డ్రైవర్ వీర కుమార్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మృతుడి సోదరుడు విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.



శ్రీను (ఫైల్)

■ లారీ, బైకు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కల్వకుర్తి మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల మేరకు.. తాండ్రకు చెందిన శ్రీను (45) వ్యక్తిగత పనుల నిమిత్తం స్వగ్రామం నుంచి కల్వకుర్తికి బైకుపై బయలుదేరాడు. మార్గమధ్యంలోని సీబీఎం కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బాబాయ్ శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు.

■ హైదరాబాద్ నుంచి వినాయకుడి విగ్రహం తెచ్చేందుకు బయల్దేరిన ఉత్సవ కమిటీ సభ్యులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటన వెల్దండ మండలం కొట్ర గేట్ సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఏపీలోని సున్నిపెంటకు చెందిన గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు హైదరాబాద్ నుంచి వినాయకుడి విగ్రహం తెచ్చేందుకు బొలేరో వాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలోని కొట్ర గేట్ వద్ద వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ మహబూబ్ సాయబ్‌తో పాటు శివ, సాయి, దాసు, అనిల్, జగదీశ్వర్, సాయి చంద్ అనే వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. అయితే బొలేరో వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మహబూబ్ సాయబ్‌ను 108 అంబులెన్స్ సిబ్బంది వరప్రసాద్, శ్రీనివాసులు దాదాపు గంటపాటు శ్రమించి బయటకు తీశారు. క్షతగాత్రులను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



బొలేరో వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మహబూబ్ సాయబ్

పడమటి అంజన్న ఉత్సవాల నాటికి కోనేరు ఆధునికీకరణ



మక్తల్‌లో కోనేరు పనులను ప్రారంభిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

మక్తల్: పట్టణంలో శ్రీపడమటి అంజనేయస్వామి ఉత్సవాల నాటికి కోనేరు ఆధునికీకరణ పనులను పూర్తిచేస్తామని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం పడమటి అంజన్న కోనేరు ఆధునికీకరణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తిరుపతి, యాదగిరిగుట్ట తరహాలో పడమటి అంజన్న కోనేరును తీర్చిదిద్ది భక్తులకు అంటుబాటులోకి తీసుకొస్తామన్నారు. అదే విధంగా దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం ప్రముఖ ఆర్కిటెక్చర్ కల్పన కోనేరు పనులను రిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా 100 కోనేరులను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అలయ కమిటీ చైర్మన్ ప్రాణేష్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గణేశ్‌కుమార్, నాగేందర్, ఆంజనేయులు, ఈట శ్యాంసుందరాచారి, రవికుమార్, కట్ట సురేశ్, నాగశివ, శ్రీనివాసులు, హేమసుందర్, చంద్రశేఖర్, అరవిందు, డీవీ చారి పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ వద్దు.. వికారాబాద్‌లో కలపండి



నంచర్లగేట్‌లో మండలాల విలీనం కోసం సమావేశమైన జేఏసీ నాయకులు

- ఉమ్మడి మండలాల జేఏసీ కార్యవర్గ సమావేశం
- వికారాబాద్‌లో కలపాలంటూ 80 శాతం యువకులు, నాయకుల తీర్మానం

మహమ్మదాబాద్/గండేడ్: గండేడ్, మహమ్మదాబాద్ మండలాలను మహబూబ్‌నగర్‌లో కలపడంతో రాజకీయం, అధికారికంగా ఎన్నో అవస్థలు పడుతున్నట్లు రెండు మండలాల జేఏసీ నాయకులు, యువకులు, విద్యావంతులు పేర్కొంటున్నారు. రెండు మండలాలను వికారాబాద్‌లో కలపాలని ఆదివారం మండల పరిధిలోని నంచర్ల గేట్ వద్ద రెండు మండలాల విలీన సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 శాతం మంది వికారాబాద్ జిల్లాలో కలపాలని, 15 శాతం మంది జిల్లా, అసెంబ్లీ, పార్లమెంటు ఒకే వైపు ఉండాలని, 5 శాతం మంది మహబూబ్‌నగర్ ఉంటేనే బాగుంటుందని తీర్మానించారు. దీంతో రెండు మండలాలకు చెందిన అన్ని పార్టీల నాయకులు అన్ని గ్రామాల ప్రజల నిర్ణయాన్ని పరిగణలోకి తీసుకొని ఉద్యమం మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. త్వరలో సీఎంను కలిసి సమస్యను వివరించన్నున్నట్లు పేర్కొన్నారు.

జేఏసీ కార్యవర్గ సమావేశం

మహమ్మదాబాద్ మండల కేంద్రంలో మండల జేఏసీ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మహమ్మదాబాద్ మండలాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలో ఉండేందుకు మండల వాసులంతా మొగ్గు చూపుతున్నారన్నారు. దగ్గర్లోని జిల్లాను విడిచి రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం మండలాన్ని మళ్లీ వికారాబాద్‌కు తరలించాలని పన్నాగం పన్నుతున్నట్లు మండిపడ్డారు. మహమ్మదాబాద్ మండలాన్ని ఎట్టి పరిస్థితుల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉండాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ, న్యాయవాది రాములు, కొమిరెలక్ష్మయ్య, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఏవీ రాములు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ కొండచిలువ పట్టివేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం దొండగుంటపల్లి శివారులోని రేణు సోలార్ ప్లాంట్ వద్ద శనివారం మధ్యాహ్నం భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. గుర్తించిన సోలార్ కంపెనీ సెక్యూరిటీ సిబ్బంది వెంటనే మేనేజర్ వసంతరావు, ఖిల్లా ఘనపురం మండల ఫారెస్ట్ రేంజర్ అధికారి మంజులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అటవీ సిబ్బంది కొండచిలువ కోసం గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. వెంటనే తన బృందంతో అక్కడికి చేరుకున్న కృష్ణసాగర్ అతి కష్టం మీద కొండచిలువను సురక్షితంగా బంధించారు. కొండచిలువ 14అడుగుల పొడవు, 23కిలోల బరువు ఉందని, దానిని బలిజపల్లి–జంగమయ్యపల్లి అటవీ ప్రాంతంలో వదిలివేస్తామని కృష్ణసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ కంపెనీ పరిసర ప్రాంతాలు అడవి పందులు, కుందేళ్లకు అనువైన వాతావరణం కలిగినందున వాటిని వేటాడి తినడానికే కొండచిలువ తరచుగా వస్తోందని, గతంలో కూడా రైతులు ఈ ప్రాంతంలో కొండచిలువలు ఎక్కువగా సంచరిస్తున్నాయని తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. పాములన్నీ విషపూరితమైనవి కావని, కనిపిస్తే వాటిని చంపకుండా తమకు సమాచారం ఇస్తే పట్టుకుని అడవుల్లో వదిలేస్తామన్నారు. కార్యక్రమంలో స్నేక్ సొసైటీ సభ్యులు చిలుక కుమార్, అవినాష్, ఫారెస్ట్ అధికారి వంశీ తదితరులు పాల్గొన్నారు.



దొడగుంటపల్లిలో కొండచిలువను పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు, స్నేక్ క్యాచర్ కృష్ణసాగర్

ఆరు అడుగుల కొండచిలువ..

గోపాల్‌పేట: మండలంలోని తాడిపర్తి పెద్దచెరువు అలుగు వద్ద ఆదివారం జాలర్లు వేసిన వలలో కొండచిలువ చిక్కుకుంది. గుర్తించిన స్థానిక రైతు స్నేక్‌సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన చెరువు అలుగు వద్దకు చేరుకుని వలలో చిక్కుకున్న కొండచిలువను వలలో నుంచి బయటకు తీసి బంధించాడు. అనంతరం గోపాల్‌పేట సెక్షన్ ఆఫీసర్ స్వప్న సమక్షంలో అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

‘నేనుసైతం’ పూజాసామగ్రి పంపిణీ



పూజాసామగ్రి అందజేస్తున్న నేనుసైతం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

మెట్టుగడ్డ: వినాయక చవితిని పురస్కరించుకుని 711 పురాతన ఆలయాలు, వినాయక మండపాలకు పూజాసామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు సామాజిక కార్యకర్త, నేనుసైతం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు దిడ్డి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వినాయక మండపాలకు అవసరమయ్యే 31రకాల పూజాసామగ్రితోపాటు, పురాతన ఆలయాల్లో నిత్యపూజకు అవసరమయ్యే సామగ్రిని అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, జిల్లాలోని పలు ఆలయాలకు ధూపదీప కార్యక్రమ సామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంతోపాటు ఏపీ, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా ఉచిత పూజాసామగ్రి పంపిణీ చేపడుతున్నామని తెలిపారు.

సొంత నిధులతోనే..

నేనుసైతం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూజాసామగ్రిని సొంత నిధులతోనే పంపిణీ చేస్తున్నామని తెలిపారు. వినాయక చవితి పండుగను ప్రతిఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నేనుసైతం సభ్యులు పవన్‌కుమార్, శ్రీనివాస్, ప్రియ, లక్ష్మీనారాయణ, సత్యం, దస్తయ్య, శ్రీహరి, గణేశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.